నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI

రేవంత్ సర్కారుకు ప్రజల నుంచి వ్యతిరేకత

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 29 : అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలే ఎండగట్టాలని బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9, 43వ వార్డుల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 43వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే కాంగ్రెస్‌పై అడుగడుగునా వ్యతిరేకత వచ్చిందన్నారు.

సూర్యాపేటలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

భువనగిరి బరిలో 39 మంది..

ముగిసిన పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- 12మంది నామినేషన్ల ఉపసంహరణ
- ఎన్నికలకు మూడు బ్యాలెట్ ఈవీఎంల అవసరం
- పోటీలోనే సీపీఎం అభ్యర్థి జహంగీర్
- ఇక మరింత హోరెత్తనున్న ప్రచారం

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఎవరుంటారనేది లెక్క తేలింది. పార్లమెంట్ పరిధిలో 39 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగిసింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలో మొత్తం 61 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 10 నామినేషన్లు ఎన్నికల అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. 12 మంది తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకున్నారు. అంతిమంగా భువనగిరి బరిలో 39 మంది బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేశ్, కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ నుంచి బూర నర్సయ్య గౌడ్ ప్రధానంగా పోటీలో నిలిచారు.

ఈవీఎంలలో మూడు బ్యాలెట్లు..

అభ్యర్థులు లెక్క కొలిక్కిరావడంతో బ్యాలెట్లు ఎన్ని అవసర పడతాయనేది తేలింది. ఒక ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ అనే మూడు ప్రధాన విభాగాలుంటాయి. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మందికి మించి అభ్యర్థులు పోటీ చేస్తే అదనపు బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉంటుంది. నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17 నుంచి 32లోపు ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు, 33 నుంచి 48లోపు ఉంటే మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉంటుంది. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో ఈవీఎంకు మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం పడనున్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 2,141 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 6,429 ఈవీఎంలు అవసరం కానున్నాయి. ఇవే కాకుండా వివిధ కారణాలతో ఇబ్బందులు తలెత్తితే సమస్య లేకుండా మరికొన్ని ఈవీఎంలను ముందస్తుగా తరలించనున్నారు. బ్యాలెట్లపై తొలుత జాతీయ పార్టీల అభ్యర్థుల పేర్లు, ఆ తర్వాత గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులను పేర్లు, ఫొటోలు, గుర్తులను ముద్రించనున్నారు. కాగా స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించాల్సి ఉంది.

విధుల్లో 3,856మంది సిబ్బంది..

ఇక మరోవైపు పోలింగ్ నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో పోలింగ్ కోసం సిబ్బందిని నియమించారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు ఉంటారు. ఈ లెక్కన జిల్లాలో 3,856మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. 964మంది పీఓలు, 964 మంది ఏపీఓలు, 1928మంది ఓపీఓలు విధులు నిర్వహించనున్నారు.

పోటీలోనే సీపీఎం..

రాష్ట్రంలో సీపీఎం భువనగిరి ఒక్క స్థానంలోనే పోటీలో నిలిచింది. ఆ పార్టీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే న ఇన్నటి వరకు సీపీఎం అభ్యర్థి బరిలో ఉంటారా..? లేరా అనే మీమాంస నెలకొంది. ఇటీవల సీపీఎం రాష్ట్ర నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంపై చర్చలు జరిపారు. కాంగ్రెస్ మాత్రం భువనగిరిలో తమకు మద్దతు తెలుపాలని కోరుతూ వచ్చింది. భువనగిరిలో సీపీఎం బరిలో ఉంటుందని ఆ పార్టీ నేతలు చెప్పుకొంటూ వచ్చినప్పటికీ స్పష్టత రాలేదు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో ఆ పార్టీ బరిలో ఉన్నట్లు తేలిపోయింది.

ఇక హోరెత్తనున్న ప్రచారం

నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోవడంతో ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు తమ దృష్టిని ప్రచారంపై కేంద్రీకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ప్రజల్లోకి వెళ్లి దూసుకెళ్తున్నారు. ఇటీవల మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం బస్సు యాత్రలో భాగంగా భువనగిరిలో రోడ్డు షో నిర్వహించి.. గులాబీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని మరింత జోరు పెంచేకుందుకు బీఆర్ఎస్ రెడీ అవుతున్నది.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

హామీలు మరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ

చౌటుప్పల్, ఏప్రిల్ 29 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. చౌటుప్పల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసాన్ని కూడా గుర్తు చేయాలని తెలిపారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, నాయకులు పెద్దిటి బుచ్చిరెడ్డి, కొత్త పర్వతాలు యాదవ్, గుండెబోయిన వెంకటేశం యాదవ్, ఢిల్లీ మాధవ రెడ్డి, సుర్వి మల్లేశ్ గౌడ్, ఆల్మాస్‌పేట కృష్ణయ్య, ఊడుగు మల్లేశం గౌడ్, కానుగు బాలరాజు, చిన్నం బాలరాజు, ఎలువర్తి యాదగిరి, సుర్కంటి రాంరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మోత్కూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 10న ఉదయం 10 గంటలకు మోత్కూరు పట్టణంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపును కాంక్షిస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా జంగ శ్రీనును నియమించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయ మాటలకు మోసపోవద్దు

హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్లను లోక్‌సభకు పంపించాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

డిండి రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేతలు

చందంపేట/ డిండి, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ పార్టీ మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తుందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన, రైతుల కోసం పోరాడేది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఓట్ల కోసం మాయ మాటలు చెబుతున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కరెంటు కోతలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. రైతు రుణమాఫీని ఇంకెన్నాళ్లు దాటేస్తూ వస్తారని, ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. ఎకరానికి రూ.15వేల రైతు బంధు, వడ్లకు రూ.500 బోనస్ ఏమయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చెందిన రాష్ట్రం.. ఇప్పుడు కరువుతో విలవిల్లాడుతుందన్నారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏం జరిగింది.. నాలుగు నెలల కాంగ్రెస్ పాలన ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు సాగునీరు, పెట్టుబడి కోసం ఎకరానికి రూ.10వేలు, రైతు బీమా, 24గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచి నీరు ఇచ్చామని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేశామని తెలిపారు. నిరుద్యోగ యువతకు రూ.4వేల భృతి, కాలేజీ యువతులకు స్కూటీలు, వృద్ధులకు రూ.4వేల పెన్షన్ ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. వాటిని అమలు చేసే తెలివి లేక కేసీఆర్‌పై తిట్ల పురాణం మొదలు పెట్టిండని విమర్శించారు. తిట్లు, ఒట్ల పురాణంతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పాలిచ్చే బర్రెను కాదు.. పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామని రాష్ట్ర ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపిస్తే దున్నపోతు మెడలు వంచి పని చేయించేందుకు కేసీఆర్‌కు ముల్లు కర్ర ఇచ్చినట్లువుతుందన్నారు. కాంగ్రెస్ మోసాలను ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే దేవరకొండ నియోజకవర్గానికి రైల్వే లైను, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం వరికి గిట్టుబాటు ధర రూ.3500, పత్తికి రూ.13వేలు అమలు జరిగేందుకు పార్లమెంటులో పోరాడుతానన్నారు. అనంతరం వెంకట్ ద్రావిడ్ ఆధ్వర్యంలో బీఎస్పీ నుంచి పలువురు జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో పార్టీ పార్లమెంటు ఎన్నికల దేవరకొండ నియోజకవర్గ సమన్వయకర్త రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, డిండి ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, పార్టీ నాయకులు సుధీర్‌రెడ్డి, టీవీఎన్ రెడ్డి, వడ్త్య రమేశ్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, ముత్యంరావు వల్లపురెడ్డి, గోవిందుయాదవ్, శంకర్‌నాయక్, లోక్యానాయక్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, గోవర్ధన్, నెహ్రూనాయక్, వెంకటయ్య, లక్ష్మయ్య, శివ, శ్రీశైలం, మురళి పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఎన్నికల ఖర్చును తప్పక నమోదు చేయాలి

- ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రమయుమ్, వ్యయ పరిశీలకులు రాకేశ్‌రంజన్, సాయన్ దేబర్మ సమక్షంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యరులు, వారి ప్రతినిధులకు ఎన్నికల వ్యయంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రేట్ కార్డు ప్రకారం అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మూడు రిజిష్టర్లలో ప్రతి రోజూ ఖర్చులు, క్యాష్ వివరాలు, బ్యాంక్ ట్రాన్జాక్షన్స్ నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మొత్తం మూడు సార్లు అభ్యర్థి లేదా అతను సూచించిన ప్రతినిధి ద్వారా ఎన్నికల ఖర్చు వివరాలు అందించాలని సూచించారు. ఒకవేళ అందించకుంటే 1951 యాక్ట్ సెక్షన్ 10-ఎ కింద మూడు సంవత్సరాలు పోటీ చేయడానికి అర్హత కోల్పోతారని తెలిపారు. ప్రతి ఒక్క అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, ఎన్నికలు అయిన తర్వాత రిటర్నింగ్ అధికారి వద్ద ఖర్చు ఫైనల్ రీకన్సిలేషన్ చేసుకోవాలని అన్నారు. సువిధ యాప్ ద్వారా ర్యాలీలు, సమావేశాలు, సభలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని, అందులో తేదీ, సమయం స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ పాల్గొన్నారు.

రైస్ మిల్లులో తనిఖీలు

రాయగిరిలోని ఓ రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి శివారులో ఉన్న ఓ రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గందరగోళం నెలకొంది. సదరు మిల్లులో సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎంక్వయిరీ చేశారు. అయితే మిల్లులో అవకతవకలు జరిగాయని ఇటీవల అధికారులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మిల్లులో వేలాది బస్తాల ధాన్యం మాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పీవీ విచారణ చేపట్టినట్లు తెలిసింది. దీనిలో రాష్ట్ర స్థాయి అధికారి కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సాధారణంగా రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పజెప్పుతుంది. మిల్లర్లు బియ్యంగా మార్చి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బియ్యం తిరిగి ఇచ్చారా లేదా..? స్టాక్ ఎంత ఉంది..? అనే కోణంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

ఉదయం తనిఖీలు ప్రారంభం కాగా, మధ్యాహ్నం తర్వాత డీసీఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, డీఎం గోపికృష్ణ మిల్లులో తనిఖీలు చేశారు. ఇదే విషయమై సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణను వివరణ కోరగా.. సాధారణ తనిఖీల్లో భాగంగానే వెళ్లామని, లారీల సమస్య, ధాన్యం ఏ గ్రేడ్ నాణ్యతపై పరిశీలించామని చెప్పారు. మిల్లులో పీవీ ఎంక్వయిరీ తన దృష్టికి రాలేదని స్పష్టం చేశారు. మిల్లుపై ఎలాంటి కంప్లయింట్ కూడా రాలేదని తెలిపారు.

భువనగిరిలో టెన్నిస్ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 29 : జాతీయ స్థాయి అండర్ -14 బాలబాలికల టెన్నిస్ క్రీడా పోటీలు భువనగిరి టెన్నిస్ అకాడమీ, అల్ ఇండియా టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఒడిశా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి 143 మంది బాల బాలికలు పాల్గొన్నారు. మొదటి రోజు రోలర్ స్పీడ్ స్కేటింగ్, టెన్నిస్, స్విమ్మింగ్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సద్ది వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ, అన్విత, అఖిల్, పాండు, వినోద్, పరమేశ్‌తోపాటు క్రీడా కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

- హామీలు అమలు చేయలేక దేవుళ్లపై ప్రమాణాలు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఏప్రిల్ 29 : మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ దేవుళ్లపై ప్రమాణాలు చేసే స్థాయికి దిగజారాడాని, ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేడని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాలలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంలో నెలకు రూ.2,500 ఇస్తానని, ఆడపిల్లల పెండ్లిళ్లకు తులం బంగారం అని చెప్పి మహిళలను మోసగించాడన్నారు. రైతు రుణ మాఫీ అని రైతులను మోసగించి ఇప్పుడు ఆగస్టు 15న మాఫీ చేస్తానని కొత్త డ్రామాకు తెరలేపి దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, ఆర్‌టీసీని దివాళా తీయించి, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమవుతున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

చేనేత సంఘాల బకాయిలు చెల్లించాలి..

2023 నవంబర్ వరకు చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, సంఘాల వద్ద నిల్వ ఉన్న స్టాకులను కొనుగోలు చేయాలని, టెస్కో ఖరీదుకు సంబంధించిన బిల్లుల జీఎస్‌టీ చెల్లించాలని, చేనేత మిత్ర సబ్సిడీ నెలకు రూ. 3000 బకాయిలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. చేనేత త్రిఫ్టు ఫండ్ పథకం కింద 2023 అక్టోబర్ నుంచి ఉన్న బకాయిలను చెల్లించాలని, ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు జగిని భిక్షంరెడ్డి, నాయకులు గుండెబోయిన సైదులు పాల్గొన్నారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఉమ్మడి జిల్లాలో రెండు సెంటర్లు

రామగిరి, ఏప్రిల్ 29 : తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీ సెట్)- 2024 దరఖాస్తుల గడువు ముగిసింది. కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో జరిగే పరీక్షకు ఈసారి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో 1,285 మంది, అగ్రికల్చర్ విభాగంలో 771 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కోదాడ పరీక్ష కేంద్రంలో ఇంజినీరింగ్ విభాగంలో 3,570 మంది, అగ్రికల్చరల్ విభాగంలో 2,142 మంది హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. మే 7 నుంచి 11 వరకు పరీక్షలు జరుగనున్నాయి.